సేంద్రియ సాగుతో నిరంతర ఆదాయం

వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరుగుతోంది. వాటి ధరలకు రెక్కలు తొడిగి పెట్టుబడి రెట్టింపు అవుతోంది. రసాయన ఎరువులతో భూమి నిస్సారం అవుతోంది. దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. పంట ఉత్పత్తుల్లో క్రిమినాశిని అవశేషాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపుతున్నారు. దిగుబడితో పాటు ఆదాయాన్ని కూడా పొందుతున్నారు.

- రసాయన ఎరువులు, పురుగుమందుల వలన పెట్టుబడి రెట్టింపు
- సేంద్రియ, ప్రకృతి సాగుతో పెట్టుబడి ఆదా
- సమీకృత వ్యవసాయంతో సిరులు
- అందరికీ ఆదర్శంగా నిలిచిన రైతు ఓబయ్య



పసుపు తోటలో రైతు ఓబయ్యతో కేవీకే శాస్త్రవేత్తలు

మైదుకూరు : సేంద్రియ విధానంలో సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు ఓ రైతు. తనకున్న పొలంలో ఆర్గానిక్ పద్ధతిలో వివిధ రకాల పంటలను పండిస్తూ సిరులు పండిస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయంతో ప్రతి రోజూ ఆదాయాన్ని పొందవచ్చని మైదుకూరు మండలానికి చెందిన ఓబయ్య అనే రైతు నిరూపించాడు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాతో సేంద్రియ వ్యవసాయ విధానంతో లాభాలు గడిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓబయ్య. మండలంలోని ఆదిరెడ్డిపల్లెకు చెందిన ఓబయ్య రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించి నష్టాలు చవిచూశాడు. అయితే వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగు చేయాలని సూచించారు. ఓబయ్య రసాయనిక వ్యవసాయం, ఏక పంట విధానానికి స్వస్తి పలికాడు. సమీకృత వ్యవసాయాన్ని ప్రారంభించాడు. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో పసుపు, కూరగాయలు, బీర, కాకర, సొర, దొండ వంటి తీగజాతి కాయగూయలు సాగు చేశాడు. పశువుల మేత కోసం నేపియర్ గడ్డి నాటాడు. సేంద్రియ ఎరువులైన ఆముదపు చెక్క, వర్మీ కంపోస్టు, వేప నూనెతో పాటు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాడు.

అధిక దిగుబడి

సేంద్రియ పద్ధతులతో పసుపు పంటలో అధిక దిగుబడి సాధించి మంచి ఆదాయాన్ని పొందాడు. కేవీకే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో పసుపులో నాణ్యత, పుచ్చు నివారణ, నిలువ సామర్థ్యం, ఆకర్షణీయమైన రంగు, కొమ్ము పరిమాణం రావడంతో మార్కెట్‌లో అధిక ధర పలకడంతో అధికంగా ఆదాయం పొందాడు. పసుపు పంటకు రక్షణ పంటగా సాగు చేసిన కందిలో కూడా మంచి దిగుబడి సాధించాడు. కూరగాయల సాగుతో వచ్చే ఆదాయంతో ప్రధాన పంట పసుపు సాగుకు పెట్టుబడులు సంపాదించాడు. కుటుంబ అవసరాలకు డబ్బును సమకూర్చుకున్నాడు. సేంద్రియ పద్ధతులతో చేయడంతో ఓబయ్య ఫలసాయానికి అధిక ధర పలికి మంచి ఆదాయం వచ్చింది. రక్షణ పంటలతో పశుగ్రాసాన్ని పొందుతున్నాడు.

సేంద్రియంతో అద్భుత ఫలితం



గతంలో రసాయనిక వ్యవసాయం చేస్తూ ఎంతో నష్టపోయాను. కేవీకే శాస్త్రవేత్తల సలహాతో సేంద్రియ వ్యవసాయం బాట పట్టాను. సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసి అధిక దిగుబడి, నాణ్యమైన ఫలసాయాన్ని పొందాను. దీంతో మంచి ఆదాయం కూడా వచ్చింది. నా పొలంలో ఏడాది పొడవునా ఆకు కూరలు, కాయగూరలు, పశుగ్రాసం సాగు చేస్తూ ఎప్పుడూ పచ్చగా ఉంచుతున్నాను. ప్రధాన పంటలతో పాటు రక్షణ పంటలు సాగు చేసి మంచి ఆదాయాన్ని పొందుతున్నాను.

– ఓబయ్య, రైతు, ఆదిరెడ్డిపల్లె, మైదుకూరు మండలం

అందరికీ అదర్శం ఓబయ్య



సేంద్రియ వ్యవసాయంలో రైతు ఓబయ్య మంచి ఫలితాలు పొందుతున్నారు. రసాయన పంటలు సాగులో ఓబయ్య ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చి మా సలహాలు, సూచనలు కోరాడు. సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటించాలని సూచించాం. పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చాం. సేంద్రియ ఎరువులను వినియోగించి మంచి నాణ్యత కలిగిన పంటతో పాటు మంచి ఆదాయాన్ని పొందాడు. పసుపులో 20 టన్నుల దిగుబడిని సాధించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచాడు.

–డాక్టర్ ఎం.బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి, కేవీకే, వనిపెంట, మైదుకూరు మండలం

నాణ్యమైన పంటతోనే అధిక ఆదాయం



సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో ఓబయ్య సాగు చేసిన పసుపు పంట మంచి నాణ్యతతో ఉండటం వల్లే ఆయనకు అధిక ఆదాయం వచ్చింది. పసుపులో 20 టన్నుల దిగుబడి సాధించాడు. టన్ను రూ.11 వేలతో విక్రయించడంతో మంచి ఆదాయం పొందాడు. విత్తనం పసుపు కొమ్ములను మంచి ధరతో విక్రయించడంతో నికర ఆదాయాన్ని కూడా పొందారు. ఓబయ్య మంచి ఫలితాలను సాధించడం పట్ల మాకు ఎంతో ఆనందంగా ఉంది.

– డాక్టర్ శ్రీవిద్యారాణి, శాస్త్రవేత్త, కేవీకే, వనిపెంట, మైదుకూరు మండలం

క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు. అలాగే ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావేదికలో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జ్యోతిక్షేత్రాన్ని పరిశీలించిన చీఫ్ కన్జర్వేటర్

కాశినాయన : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిక్షేత్రాన్ని రాష్ట్ర అటవీ చీఫ్ కన్జర్వేటర్ నాయక్ ఆదివారం సందర్శించారు. జ్యోతిక్షేత్రంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన గమనించారు. అనంతరం చెలిమెబావి వద్ద ఉన్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈయన వెంట డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, ఫారెస్టు రేంజ్ అధికారి రఘురామిరెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న మహమ్మద్ గౌస్

ప్రొద్దుటూరు : మండలంలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని అమ్మనాన్న మదర్ థెరిస్సా షబ్బీర్ వృద్ధాశ్రమంలో ఆదివారం మైనారిటీ నాయకుడు వైఎస్ మహమూద్ జయంతి సందర్భంగా ఆయన కుమారులు కౌన్సిలర్ వైఎస్ మహ్మద్ గౌస్, వైఎస్ ముస్తఫా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వృద్ధులకు వారు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ మహ్మద్ గౌస్ కుటుంబ సభ్యులు, ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

- పట్టణంలోని యాచకులకు, నిస్సహాయకులకు, వృద్ధులకు ఆదివారం మధ్యాహ్నం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నపురెడ్డి శివజస్విత పుట్టిన రోజు సందర్భంగా ఆమె తాత శివరామిరెడ్డి, అవ్వ ఈశ్వరమ్మ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని సమితి చైర్మన్ సునీల్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, న్యాయవాది సుమంత్, రాజు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు) : పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ ధనిశెట్టి ఓబయ్య సతీమణి శనివారం గుండెనొప్పితో మృతి చెందింది. ఆదివారం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి.. కుటుంబసభ్యులను ఓదార్చారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



జయపాల్ (ఫైల్)

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సగిలి జయపాల్ (48) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తహసీల్దారు కృష్ణకుమార్ జయపాల్ మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు రూ.20 వేలు నగదును మృతుని భార్యకు అందజేశారు. అలాగే మండలంలోని వీఆర్‌ఏలు కూడా జయపాల్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని పెద్దగురువళూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా.ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘనంగా చిన్న సరిగెత్తు



టంగుటూరులో బాబా పక్కృద్దీన్ పీరును ఊరేగిస్తున్న దృశ్యం

రాజుపాళెం : మొహరం వేడుకలలో భాగంగా మండలంలోని టంగుటూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా పక్కృద్దీన్ పీరును ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పీర్ల చావిడి వద్ద గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు చేశారు. అనంతరం బాబా పక్కృద్దీన్ పీరును బ్రహ్మయ్య, మరి కొంతమంది యువకులు ఎత్తుకొని వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

ఏపీఆర్‌సీఈటీలో 29వ ర్యాంక్ సాధించిన కల్పన

బ్రహ్మంగారిమఠం: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2023–24 ఫలితాలలో వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మునగల సుబ్బరాజు, మునగల లక్ష్మీనారాయణమ్మ కుమార్తె మునగల కల్పన 112 మార్కులతో రాష్ట్రంలో 29వ ర్యాంక్ సాధించింది. 29వ ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

మానవ సేవే లక్ష్యం

జమ్మలమడుగు : మానవులకు సేవ చేయడం అంటే దేవుడికి సేవ చేయడమే అనే సిద్ధాంతంతో వెలసిన సంస్థ మానవతా స్వచ్ఛంధ సంస్థ అని రిటైర్డు ఎంఈఓ మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎప్పీ డిగ్రీ కాలేజీలో మానవతా స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవ చేయాలనే కోరిక కలిగిన వారిని తమ సంస్థలో సభ్యులుగా తీసుకుని తద్వారా ప్రజలకు మంచి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వైభవంగా గజపూజ మహోత్సవం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని యర్రబల్లె పంచాయతీలో ఉన్న మల్లికార్జునపురం గ్రామంలో ఆదివారం గజపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో గజపూజ నిర్వహించారు. గ్రామంలో చెక్క భజనలు నేర్చుకుని నెలరోజుల తర్వాత గజపూజ కార్యక్రమాన్ని గురువులు, మస్తాన్, కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పెద్దలు, పిల్లలు, మహిళలు గజపూజలో పాల్గొని చెక్కభజనలతో ఆకట్టుకున్నారు.

ఎటుపోయావు వానమ్మా..



గాదెగూడూరులో సాగు చేసిన మినుము పంట

రాజుపాళెం : ఆరుగాలం కష్టించే రైతన్నలు వరుణదేవుడి కరుణ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఖరీఫ్ ఆరంభమై నెలు రోజులు గడుస్తున్నా... వర్షం జాడలేదు. మబ్బులు పట్టి ఊరించడం.. ఉసూరుమనిపించడ తప్ప భూమ్మీద చినుకుల సవ్వడి లేదు. మండలంలోని గాదెగూడూరు, టంగుటూరు, రాజుపాళెం తదితర గ్రామాల్లోని కొంతమంది రైతులు మినుము పంట సాగు చేశారు. అయితే ప్రస్తుతం భూమిలో తేమశాతం లేకపోవడంతో పెరుగుదల ఆగిపోయింది. చేసేదేమిలేక రైతులంతా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతుందే తప్ప చినుకు జాడ లేకపోవడంతో పంట సాగు చేసిన రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు దాదాపు రూ.5 వేలు ఖర్చు చేశామని, అలాగే పురుగు మందులు కూడా పిచికారీ చేశామని చెబుతున్నారు. పంటలో ఎదుగుదల లేకపోవడంతో మందులను పిచికారీ చేయకపోవడంతో పురుగుల ఉధృతి ఎక్కువైందని చెబుతున్నారు. నీటి తడులు అందిచడానికి నీరు కూడా ఎక్కడా లేదని అంటున్నారు. వరుణ దేవుడు కరుణిస్తే తప్ప పంటను కాపాడు కోలేమని వాపోతున్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి, వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జేవీవీ ప్రొద్దుటూరు పట్టణ వార్షిక ప్లీనం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 ఏళ్ల సైన్స్ ఉద్యమంలో ప్రొద్దుటూరుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం మానవ హక్కులకు భంగం కలిగినా ప్రశ్నించే తత్వం లేదని, భిన్న సంప్రదాయాలను, ప్రజాసామ్యాన్ని సహించే స్థితి ఉందన్నారు. ప్రజా స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, సమాజంలో మార్పుకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జన విజ్ఞాన వేదిక చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదకను ప్రధాన కార్యదర్శి సునీత వివరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, పోలంకి శ్రీరాములు, నంగా రాజేష్, ఈశ్వరయ్య, అల్లాబకాష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శులు కె.బ్రహ్మానందరెడ్డి, సురేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు సి.బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో ఎలాంటి పురోగతి లేదని తెలిపారు. అందరికి వెలుగులను అందించిన వీరు మాత్రం చీకట్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పాట్ బిల్లింగ్ చేసే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వారందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలను అన్నింటిని ఐక్యం చేసి విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శులు గురుస్వామి, శివ, కేశవరెడ్డి, నాయకులు నవీన్, సుబ్బయ్య, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెజీషియన్ హరేరామ్‌కు 'నమ్మి విక్రమ్' అవార్డు

మైదుకూరు : మైదుకూరుకు చెందిన ప్రముఖ మెజీషియన్ హరేరామ్‌కు ఆదివారం కర్ణాటక సైన్స్ ఫోరం 'నమ్మి విక్రమ్' అవార్డును ప్రదానం చేసింది. బెంగళూరు కేఆర్ పురలోని ఆర్కే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కర్ణాటక సైన్స్ ఫోరం 5వ వార్షికోత్సవంలో హరేరామ్‌ను నమ్మి విక్రమ్ అవార్డుతో పాటు రూ.10వేలు గదు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. మైదుకూరులోని పార్వతినగర్‌కు చెందిన హరేరామ్ 12 ఏళ్లుగా ఇంద్రజాల కళ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం, పర్యావరణం, మూఢనమ్మకాలు, ఆరోగ్యం, సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేస్తున్నట్లు కర్ణాటక సైన్స్ ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సైన్స్‌ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆశా'లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

బద్వేలు అర్బన్ : ప్రజారోగ్యం కోసం క్షేత్రస్థాయిలో ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం పని చేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాడ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం జె.వి.భవన్‌లో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, శాంతమ్మ, పట్టణ నాయకురాళ్లు ధనమ్మ, శ్యామల, వెంకటసుబ్బమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌తో తీవ్ర నష్టం



ప్రొద్దుటూరు కల్చరల్ : మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)తో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జీపీఎస్ అమలు ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ సీపీఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ ఉద్యోగులతో చర్చించి, వారికి ఆమోద యోగ్యమైన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఉద్యోగుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం అర్ధరాత్రి జీఓ విడుదల చేయడాన్ని ఏపీ సీపీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకట జనార్దన్ రెడ్డి ఖండించారు. ఏపీసీపీఎస్ సభ్యులు మస్తాన్ వలి, దేవా, రిజ్వాన్ ఆలీ, బాలజోజప్ప, బాబా ఫక్రుద్దీన్, మధు, రామకృష్ణారెడి పాల్గొన్నారు.



పోరుమామిళ్ల (అట్లూరు) : ప్రభుత్వం విడుదల చేసి జీఓ కాపీలను చూపిస్తున్న చెన్నయ్య

పోరుమామిళ్ల (అట్లూరు) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతుంటే అందుకు విరుద్ధంగా ప్రభుత్వం జీపీఎస్ అమలు చేస్తూ జీఓ విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య, మండల అధ్యక్షుడు బి.ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుండిచి సీపీఎస్ ఉద్యోగులందరిని జీపీఎస్‌లోకి తెస్తూ జీఓ ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చడమేనని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు క్రిష్ణయ్య, బాలచంద్రయ్య, చెన్నక్రిష్ణయ్య, జాషువ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ప్రభుత్వాస్పత్రిని కాపాడుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వెయ్యికిపైగా ఓపీ ఉన్న జిల్లా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. గతంలో ఆస్పత్రి అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు మాజీ వైద్య శాఖ మంత్రి విడుదల రజనీ తెలిపారని గుర్తుచేశారు. కానీ ఐదు పైసలు కూడా ఖర్చు చేసినట్లు కనపడలేదని విమర్శించారు. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ మందులను అరికట్టడానికి ఏర్పాటు చేసిన డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని పులివెందులకు మార్చారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి డ్రగ్ కార్యాలయాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయాలని కోరారు. కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, డి.శివారెడ్డి, హరి పాల్గొన్నారు.

డ్యాన్సర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా బాబు నియామకం

బద్వేలు అర్బన్: ఏపీ ఫిల్మ్ డ్యాన్స్‌మాస్టర్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బద్వేలు పట్టణానికి చెందిన అనూష్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు, డ్యాన్స్ మాస్టర్ చెంచు ఓబుగాండ్ల బాబు అలియాస్ బాబు మాస్టర్ నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యాన్స్‌మాస్టర్లు, డ్యాన్సర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీ 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : సరిగ్గా 37 ఏళ్ల క్రితం విడిపోయిన స్నేహితులంతా ఒకే వేదికపై కలవడంతో వారి భావోద్వేగాలకు అంతు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని లింగాపురం వద్ద ఉన్న రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీలో 1986–87లో కలసి చదువుకున్న బీపీఈడీ, యూజీపీఈడీ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆ బ్యాచ్ విద్యార్థి, ప్రస్తుతం ఇదే కాలేజీలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న ఆకేపాటి శంకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరినొకరు మనసారా పలకరించుకుని, ఆ నాటి తీపి గుర్తులను కలబోసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ పూర్వ అధ్యాపకులు పీకే సుబ్రహ్మణ్యం, శివశంకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డిని ప్రస్తుత కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్, అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

పెన్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేనా..?

- అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు



రామేశ్వరం వద్ద పెన్నానదిపై నిర్మాణంలో హైలెవెల్ బ్రిడ్జి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని రామేశ్వరం పరిధిలో పెన్నానదిపై హైలెవెల్ బ్రిడ్జి పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో పనులు పునఃప్రారంభం అవుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెన్నానది మీదుగా ఆర్టీపీపీ, ముద్దనూరు, పులివెందుల వరకు అనేక గ్రామాలకు వెళ్లవచ్చు. ఆర్టీపీపీ పరిధిలోని పలు గ్రామాలకు ఈ బ్రిడ్జి నిర్మాణం అనుకూలంగా ఉంది. 2019 డిసెంబర్ 23న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్నా హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సాంకేతిక అనుమతుల మంజూరు, కరోనా ప్రభావం కారణంగా పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రూ.52.60 కోట్లతో ఈ పనులను ప్రారంభించారు. 1.3 కిలోమీటర్ల పరిధిలో బ్రిడ్జి నిర్మాణంతో పాటు అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ ఏడాది కాలం పాటు వేగంగా పనులు నిర్వహించారు. 35 నుంచి 40 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.18 కోట్ల వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని గత ఎన్నికలకంటే ముందుగానే కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా వదిలి వెళ్లిపోయారు.

పిల్లర్స్ నిర్మాణం పూర్తి

బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పెన్నానదిలో 31 పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. కేవలం శ్లాబులను మాత్రమే (గడ్డర్స్) తయారు చేసి అమర్చాల్సి ఉంది. ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో పెన్నానదిలోకి నీరు వస్తే రాకపోకలు ఆగిపోయే పరిస్థితి ఉంది. పాలకులు పెన్నా బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారిస్తే ప్రజలకు ఎంతో అనువుగా ఉంటుంది.